క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పండరీపురంలోని పలు ప్రాంతాలలో గురువారం సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పండరీపురంలోని 2, 3, 4 లైన్ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈకేవైసీ నమోదు నూరు శాతం చేయించాలి

శావల్యాపురం: రీసర్వే పనుల్లో భాగంగా భూహక్కు పత్రాలు అర్హత కలిగిన రైతులందరు ఈకేవైసీ నమోదు చేయించాలని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు తెలిపారు. మండలంలోని పిచికలపాలెం గ్రామ సచివాలయం పరిధిలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను బుధవారం పరిశీలించారు. మండలంలోని పిచికలపాలెం-45 శాతం, వేల్పూరు- 62 శాతం, కనమర్లపూడి- 88 శాతం, పోట్లూరు- 37 శాతం నమోదు అయినట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచి తిరివిధి శివకుమారి, డెప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం



నాదెండ్ల: గణపవరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 250 మంది అయ్యప్ప మాలధారులు ఇటీవల గ్రామంలోని వివిధ ఆలయాల్లో పీఠాలు ఏర్పాటు చేసుకుని దీక్ష చేపట్టారు. బుధవారం పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం వాహనంపై ఏర్పాటు చేసి అక్కడి నుంచి మరబావి సెంటర్, కోండ్రువారి వీధి, కాట్రు వారి వీధి, పశువుల ఆసుపత్రి, మెయిన్‌రోడ్డు గుండా జాతీయరహదారి వరకూ ఊరేగింపు నిర్వహించారు. సంప్రదాయ మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: గంజాయి విక్రయం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు పెదచెరువు మొదటి లైన్‌లో తనిఖీలు నిర్వహించి అక్రమంగా గంజాయి కలిగిఉన్న నాదెండ్ల మండలం భుక్యాపురం గ్రామానికి చెందిన అల్లం శివశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్ల సీఐ తెలిపారు.

7న చలో అలంపూర్



నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 7వ తేదీన అలంపూర్ నుంచి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టే మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర విజయవంతం చేయాలని ఆ సంస్థ నాయకులు కోరారు. ఈ మేరకు ఎన్‌జీవో హోమ్‌లో బుధవారం పాదయాత్రకు చెందిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పాదయాత్రకు బ్రహ్మరథం పట్టాలని పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకిబాబు మాదిగ, జిల్లా కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల, జిల్లా ఉపాధ్యక్షులు సత్యానందం మాదిగ, , జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లవరపు బాబు మాదిగ, సీనియర్ నాయకులు శ్రీను మాదిగ, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు మాదిగ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నరసరావుపేట: పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించి వారి కుటుంబాలను పరామర్శించారు. ఒక్కొక్కరికి పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం పట్టణంలోని వెంగళరెడ్డి కాలనీకి చెందిన అమీర్(28), రావిపాడు గ్రామానికి చెందిన ఏ ఆరోగ్యం(50) చిలకలూరిపేట నుంచి నరసరావుపేటకు వస్తుండగా మార్గమధ్యలో వర్షం రావడంతో చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందిన విషయం విదితమే. ఎమ్మెల్యే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్ల కిందికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పిడుగుపాటుకు గురైన కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పి.చిట్టిబాబు, ఎంపీపీ ఎం.శ్రీనివాసరావు, నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, సయ్యద్ పెదఖాజా పాల్గొన్నారు.

ప్రజలందరి కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



జొన్నలగడ్డ ఆరోగ్య సురక్ష శిబిరంలో ఓ వృద్ధురాలికి బీపీ చూస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నూజెండ్ల వైద్యశిబిరంలో మందులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కోటప్పకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆర్‌వీ రమణకుమార్ పర్యవేక్షణలో బుధవారం మండలంలోని జొన్నలగడ్డలోని గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సముదాయంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శిబిరానికి వచ్చి క్యాంపునకు వచ్చిన ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వృద్ధురాలి బీపీని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష ప్రజలకు ఒక్క గొప్పవరమన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇళ్లవద్దకే వైద్యసేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వైద్యశిబిరంలో 320 మందికి కేస్ షీట్లను తెరిచి వైద్యసేవలు అందజేశారు. ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సింధూజ, ఎంబీబీఎస్ డాక్టర్లు సయ్యద్ ఇబ్రహీం, డాక్టర్ నందకుమార్ వైద్యపరీక్షలు చేసి మందులు రాసిచ్చారు. సీడీపీఓ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలతో తయారుచేసిన వంటకాలు, పౌష్టికాహార పాకెట్లను ప్రదర్శించారు. శిబిరాన్ని ఈఓపీఆర్డీ కె.రమణకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పర్యవేక్షించగా జెడ్పీటీసీ సభ్యుడు పి.చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి కుందా చిన్న, మాజీ సర్పంచు గుర్రం వెంకటప్పారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రామసీత, శ్రీరామ్, సతీష్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం

నూజెండ్ల: ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకమే జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకొని మందుల పంపిణీని పరిశీలించారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారిని గుర్తించి మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, అంజిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

యడ్లపాడు: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు ఘంటా శంకర్ తెలిపారు. మండలంలోని జాలాది గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ప్రారంభించారు. యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు ఆర్.గోపీనాయక్, ఎం.ప్రభాకరరావు, వివిధ విభాగాల్లో వైద్యనిపుణులు ప్రతాప్‌కుమార్, ఎం.దీపిక, పి.శ్రీనివాసరావు, షేక్ నజీర్ సేవలందించారు. జగ్గాపురం, జలాది గ్రామాల నుంచి వచ్చిన 273 మందికి ముందుగా ఓపీ రిజిస్ట్రేషన్లు చేశారు.135 మంది కంటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేశారు. వీరిలో 125 మందికి కళ్లజోళ్లు రాయగా, ఏడుగురికి మందులు ఇచ్చారు. మరో ముగ్గుర్ని కంటివైద్యశాలలకు సిఫార్సు చేశారు. సురక్ష శిబిరంలో రిఫరల్ చేసిన కేసుల్ని ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం, సర్జరీలు ఉచితంగానే చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కూరకుల బాబు, ఎంపీటీసీ సభ్యులు కర్రా రత్నకుమారి, మండల ప్రత్యేక అధికారి పి.రాధారాణి, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, ఈఓపీఆర్డీ డి.వరూధిని, డీటీ ఎస్.శ్యామలత, పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్.పున్నారావు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ నిర్మల, సూపర్‌వైజర్ పార్వతి, పంచాయతీ కార్యదర్శి జి.సురేష్, వీఆర్వో కేపీ చారి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

శావల్యాపురం: ఆరోగ్యమే మహాభాగ్యమని మని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయం -2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పేదలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 385 మంది రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచి రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ఎం.సుహాసిని, ఎంపీడీఓ పి.సీతారామయ్య, ఈఓపీఆర్డీ పి.సుగుణ, వైద్యాధికారులు వి.వెంకట భాస్కర్, పి.త్రివేణి, చాంద్‌బాషా, సత్యరెడ్డి, రాజశేఖర్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

యడ్లపాడు: అందరికీ సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను అంతటా నిర్వహిస్తోందని యడ్లపాడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి పి.రాధారాణి చెప్పారు. మండలంలోని జాలాది గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, డీఈ ఎస్ శ్యామలత, ఈఓపీఆర్‌డీ డి.వరూధిని, వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, సర్పంచి బాబు, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, వైద్యాధికారి గోపీనాయక్, ఏసీడీపీఓ నిర్మల పాల్గొన్నారు.



జాలాదిలో జగనన్న సురక్ష క్యాంపును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వైద్యశిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



జొన్నలగడ్డ శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న జేసీ శ్యాం ప్రసాద్



ఓ మహిళ కళ్లను పరీక్షిస్తున్న మహిళా ఆరోగ్య సిబ్బంది

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపికై నట్లు శారదా జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.రత్నజ్యోతి తెలిపారు. బాపట్లలోని వీబీ సాల్వేషన్ ఆర్మీ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ పోటీలు గత సెప్టెంబర్ 27వ తేదీన నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-14 విభాగంలో పాఠశాల ఏడో తరగతి విద్యార్థి షేక్ సలీం, అండర్ -17 విభాగంలో వాడల దుర్గాభవన్, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు పాదిలి వెంకటేశ్వర్లు, నేలపాటి సువర్ణరాజు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ పోటీల్లో చిరుమామిళ్ల విద్యార్థుల సత్తా



జిల్లాజట్టుకు ఎంపికైన క్రీడాకారులతో రామిరెడ్డి, ఉపాధ్యాయులు

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలకు చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలో టెన్నికాయిట్ అండర్ 17 పోటీలు జరగ్గా, ఇందులో ఐదుగురు ఎంపికయ్యారు. వీరిలో జెట్టిపాటి శివకీర్తన, దన్నవరపు శ్రీలత, చేబ్రోలు పూజిత, పందిరి పావని, షేక్ ఆసిఫా ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి, హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గణపవరంలో పశు విజ్ఞాన బడి



గణపవరం పశువైద్యశాలలో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి శ్రీధర్

నాదెండ్ల: జగనన్న పాల వెల్లువ యాప్‌లో రిజిస్ట్రార్ అయిన పాడి రైతులకు త్వరలో జీడీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే సర్వే పూర్తయినందున గణపవరం గ్రామ పరిధిలో 101 మంది రైతులు రిజిస్టార్ చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో పశు విజ్ఞాన బడి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల పరిధిలో ఇర్లపాడు, అప్పాపురం గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 101 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారన్నారు. జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్లు, వైట్ క్యాటిల్స్‌కు ఎల్‌ఎస్‌బీ వ్యాక్సిన్లు, లేగదూడలకు బూసిల్లా వ్యాక్సిన్లు పూర్తి చేశామన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గర్భ నిర్ధారణ పరీక్షలు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పశు యజమానులు గ్రామీణ పశువైద్యశాలలో వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.

ఎన్‌ఐఏ దాడులు అప్రజాస్వామికం



దాడులకు నిరసనగా పోస్టర్ ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: ప్రజాసంఘాలపై ఎన్‌ఐఏ దాడులను సభ్యసమాజం మొత్తం ఖండించాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. ఇటీవల పీడీఎంకు చెందిన జి.రామకృష్ణ, నల్లపాటి రామారావు గృహాల్లో ఎన్‌ఐఏ చేసిన సోదాలను పురస్కరించుకొని బుధవారం ఎన్‌జీఓ హోం ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల రెండో తేదీన తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌ఐఏ చేసిన దాడులు అప్రజాస్వామికమన్నారు. నాయకులు ఇళ్లల్లో లేని సమయంలో ఇళ్ల తాళాలను పగులకొట్టి సోదాలు చేసి చుట్టుపక్కల వారిని వారి ఆచూకీ తెలియజేయాలని కోరుతూ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, సీఎల్‌సీ నాయకులు శిఖినం చిన్నా పాల్గొన్నారు.

కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన పీఆర్కే



కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో నాక్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నాక్ బృందం సభ్యుల వివరాలు, బృందం పరిశీలించే వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు, మరో రూ.30 లక్షలతో ఏర్పాటు చేస్తున్న అదనపు సౌకర్యాలను పరిశీలించారు. ఈ నెల 6, 7 తేదీల్లో నాక్ బృందానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకుమార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఎక్కడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కండేయరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, తురకా కిషోర్, ఎంఈఓ వేముల నాగయ్య తదితరులు ఉన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు

ఈపూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అవసరమైన విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. ఈపూరు, కొచ్చర్ల రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు బుధవారం మినుములు పంపిణీ చేశారు. ఈ నెల 8వ తేదీ లోగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శాకమూరి బుచ్చయ్య పాల్గొన్నారు.

నేడు మేరిమాత మందిరం ప్రారంభం



నాదెండ్ల: చిరుమామిళ్లలో రూ.5 లక్షలతో నిర్మించిన మేరి మాత మందిరం గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన యన్నంరామిరెడ్డి, కోటేశ్వరమ్మ ఆర్థిక సహకారంతో మందిరం నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

గుడ్‌షపర్డ్ పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో బాస్కెట్ బాల్ క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో రాణించడం అభినందనీయం

మాచర్ల: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పోలీసు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో 200, 400 పరుగు పోటీలు, లాంగ్‌జంప్‌లో బంగారు పతకం సాధించిన హెడ్‌కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎస్కార్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ క్రీడా రంగంలో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ బోయరఘురామిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు శావల్యాపురం విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల హెచ్.ఎం.విజయలక్ష్మి, పీడీ రాధాకృష్ణమూర్తి

శావల్యాపురం: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థులు అండర్-17 వాలీబాల్ బాలురు విభాగంలో ఓర్సు మరనాథ్, దేవరాజ్ ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికై న క్రీడాకారులు అనంతరం నియోజకర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 6న చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్వహించనున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల అండర్-17 బాలుర పోటీల్లో వాలీబాల్ జట్టుకు ఎంపిక పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు,భువనేశ్వరీ, శ్రీకాంత్, సుభాష్‌చంద్రారెడ్డి, హనిమిరెడ్డి ఉన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



రెంటచింతల: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా కార్యాలయ ఉద్యోగులు(జీడీఎస్) ప్లకార్డులతో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పనితో పాటు పూర్తిగా అన్ని ప్రయోజనాలు కల్పించాలని, జీడీఎస్‌కు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీడీఎస్ సీనియర్ ఉద్యోగులకు 12, 24, 36 సం.ల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు కల్పించాలని, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను ఖచ్చితంగా అమలుచేయాలన్నారు. టార్గెట్స్ మేళా రూపంలో జీడీఎస్ ఎదుర్కొంటున్న అన్ని వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలీ, మంత్రునాయక్, సుధారాణి, మార్కొండయ్య, సైదారావు, నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, వేణుగోపాల్‌రెడ్డి, సోమ్లానాయక్ తదితరులున్నారు.

మిర్చి పంట ధ్వంసం



మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముళ్ళ రాజయ్యకు చెందిన రెండు ఎకరాల పొలంలో రెండు నెలల క్రితం మిర్చి మొక్కలు నాటాడు. అయితే మంగళవారం రాజయ్య భార్య సైదమ్మ మిర్చి మొక్కలకు బలం మందు పెట్టి సాయంత్రం వరకు పొలంలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పొలంలో కలుపు తీసేందుకు కూలీలతో వెళ్ళగా పొలంలో మొక్కలు ధ్వంసం చేసినట్లుగా ఉండటంతో బోరున విలపించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్ బుధవారం తెలిపారు. దాచేపల్లి మండలం సారంగపల్లెకు చెందిన తోటపాటి ఆదినారాయణ(40) ఆదివారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో మైసమ్మ అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.30 సమయంలో గుర్తు తెలియని వాహనం ముందు వెళ్తున్న ఆదినారాయణ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఆదినారాయణ తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ ద్వారా వార్డులో అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ అన్నారు. కన్జ్యూమర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి తుమ్మల వెంకటేష్ జన్మదినం సందర్భంగా వెంకటపతి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.